జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 15-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 455 పేజీలు: 4 వెల : రూ.7



# ఆనందంగా ఉంది

- ఎర్రన్న విద్యా సంకల్పం సత్ఫలితాన్నిచ్చింది
- ఉత్తమ ప్రమాణాలతో శిక్షణ ఇస్తున్నాం
- డీఎస్సీ ఫలితాల్లో 130 మంది ఉత్తీర్ణులయ్యారు
- నాన్న జీవితమే.. నాకు గైడ్
- 2023లో ఎర్రన్న విద్యాసంకల్పం ప్రారంభించాం
- 8వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారు
- 4500 మందికి వివిధ పరీక్షలకు శిక్షణ
- ఏపీపీఎస్సీ తరహాలో పరీక్షల నిర్వహణ
- నిష్ణాతులతో స్టడీ మెటీరియల్ రూపొందించాం
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ప్రజా సదన్‌లో విద్యార్థులతో ముఖాముఖి










**శ్రీకాకుళం, సెప్టెంబర్14 (వార్త):** ఉన్నత లక్ష్యంతో ప్రారంభించిన ఎర్రన్న విద్యా సంకల్పం సత్ఫలితాలు ఇస్తుండటం చాలా ఆనందంగా ఉందని కేంద్ర పౌరవిమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో సైతం 130 మంది ఎర్రన్న విద్యా సంకల్పం విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని ప్రజాసదన్‌లో ఎర్రన్న విద్యా సంకల్పం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యే గొండు శంకర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు దాసు నాయుడు తో కలిసి పాల్గొన్నారు. తొలుత ఎర్రన్నాయుడు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో రామ్మోహన్ మాట్లాడారు. తన ఆధ్వర్యంలో నడుస్తున్న భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమాన్ని 2023లో ప్రారంభించామని తెలిపారు. ఎర్రన్నాయుడు తన జీవితంలో సంపాదించిన ఆస్తి ఏదైనా ఉంది అంటే అది ప్రజల్లో సంపాదించిన స్థానమే అని తెలిపారు. అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాకు నాన్న జీవితమే గైడ్‌గా ఉపయోగపడినట్టు గుర్తు చేశారు. ప్రజారంజక కార్యక్రమాల ద్వారా వరుసగా గెలుస్తూ వస్తున్నా.. జిల్లాకు ఇంకా ఏదో చెయ్యాలి అనే వెలితి ఉండేదని, ఎర్రన్న విద్యా సంకల్పం ద్వారా ఆ సంతృప్తి లభించిందని చెప్పారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలసి ఎర్రన్న విద్యా సంకల్పం కాన్సెప్ట్‌ను రూపొందించామని, అది ఎప్పకప్పుడు విస్తృతం అవుతూ ఉందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, తదితర సమస్యలతో పోటీ పరీక్షలకు, ఉద్యోగాలకు నిరుద్యోగులు దూరం అవుతున్నారన్న అంశం ఎర్రన్న విద్యా సంకల్పం ఏర్పాటుకు మూల కారణమని చెప్పారు. నామ మాత్రంగా, ఆర్భాటం కోసం ఎర్రన్న విద్యా సంకల్పం చెయ్యలేదని, దూరదృష్టితో నే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. జిల్లాలో యువతకు డీఎస్సీ, గ్రూప్స్, కానిస్టేబుల్ పరీక్షల విషయంలో అవసరమైన కోచింగ్, మాక్ టెస్టులు, మెటీరియల్‌లను అందజేయడం జరిగిందని తెలిపారు. అవసరమైన వారికి, ఉపయోగపడేవారికే లబ్ధి చేకూరాలని అంశంతో ఏపీపీఎస్సీ తరహాలో ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించి క్వాంటిటీ కాదు.. క్వాలిటీ స్టూడెంట్స్‌కు ఎర్రన్న విద్యా సంకల్పం ద్వారా అవసరమైన నాలెడ్జ్‌ను చేరువ చేశామని అన్నారు. ఎంట్రన్స్ పరీక్షకు కూడా ఎనిమిది వేలమందికిపైగా రిజిస్టర్ అయ్యారు అని, నాలుగు వేల ఐదు వందల మందికి పైగా పరీక్షను రాయడం జరిగిందని వివరించారు. అందులో ఏడు వందల మందికి ఎర్రన్న విద్యా సంకల్పం టీం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే కోచింగ్, ఉన్నతమైన మెటీరియల్, నిష్ణాతులు రూపొందించిన ప్రశ్నావళితో మాక్‌టెస్ట్ లను అందిస్తూ ఉన్నామని స్పష్టం చేశారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో ఉద్యోగం సాధిస్తామన్న నమ్మకాన్ని చూశామని తెలిపారు. తన తండ్రికి చదువు అంటే ఎంతో ఇష్టమని.. అలా ఆయనకు ఇష్టమైన విద్య ద్వారా నలుగురికి ఎర్రన్న విద్యా సంకల్పం చేరువ కావడం ఎంతో సంతృప్తి ఇస్తోందని అన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు అందించారు. అధ్యాపక బృందానికి సన్మానించారు. అనంతరం ఆర్‌ఆర్‌బి తర్ఫీదు తీసుకుంటున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను అందజేశారు.

- భక్తులను దోచేస్తున్న కొందరు అర్చకులు, వ్యక్తులు
- వెల్లువెత్తుతున్న విమర్శలు
- భక్తుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు:ఈవో

# శ్రీముఖలింగంలో.. అన్నదానం పేరిట వసూళ్లు



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 (వార్త):** శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదానం పేరు చెప్పి కొంత మంది అర్చకులు, వ్యక్తులు భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఒడిశా నుంచి శ్రీముఖలింగానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. కొందరు అర్చకులు వారిని స్వామి వారి చెంతకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు. ఆ తర్వాత భక్తులకు అన్నదానం చేస్తే మంచి జరుగుతుందని చెబుతూ వారి నుంచి విరాళాలను దొరికనకాడికి దండేస్తూ దోచేస్తున్నారు. దీనిపై ఇటీవల కొందరు దేవదాయ శాఖాధికారులకు ఫిర్యాదు కూడా చేసినట్టు తెలిసింది.

## అన్నదానం పేరిట వసూలు చేయొద్దు

జలుమూరు: దేవదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా అన్నదానం కోసం విరాళాలు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆలయ ఈవో వాసుదేవరావు తెలిపారు. అర్చకులు, సిబ్బంది అనధికారంగా వసూలు చేయకూడదన్నారు. ఎవరైనా వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు పందిరి రాట

**జి.సిగడాం, సెప్టెంబర్ 14(వార్త):** ఎస్పీఆర్‌పురం గ్రామంలో దసరా నేపథ్యంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు పందిరి రాటను యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సుమారు గత పది సంవత్సరాలుగా గ్రామంలో దేవి ఉత్సవాలు నిరాటంకంగా నిర్వహిస్తున్నామన్నారు.



# ఉద్దానం టు అమెరికా

* ఉద్దానం జానపదానికి గుర్తింపు
* మందస దేవరాజు అధ్యక్షతన బృందానికి అరుదైన గౌరవం
* ఉద్దాన జానపదం.. బుక్ ఆఫ్ డిస్కవరిలో నమోదు

**మందస, సెప్టెంబరు 14(వార్త):** ఉద్దానం కళకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వచ్చింది. ఉత్తరాంధ్రలోనే ఉద్దానం జానపదానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎంతోమంది కళాకారులు కనుమరుగైపోతున్న కళలను బతికిస్తున్నారు. ప్రధానంగా ఉద్దానం కళాకారులు జానపదాలను జీవం పోసేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. మందస మండలంలోని నారాయణపురం పంచాయతీ మల్లేనవారిపేట గ్రామానికి చెందిన మల్లేన దేవరాజు జానపద కళాకారునిగా రాణిస్తూ.. ఆయన కుమారుడు, కుమార్తెలను కూడా జనపద కళాకారులకు తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాంతంలో పలువురు కళాకారులు సంయుక్తంగా చేసిన కృషి ఫలించింది. ఉద్దానం జానపదానికి బుక్ ఆఫ్ డిస్కవరిలో నమోదు అయ్యింది. కుత్తం వినోద్, బత్తిన శాంతారావు, పుక్కల్ల రాజేంద్ర, నక్క వాసు, డాక్టర్ కుమార్ నాయక్, రాపాక ధనరాజు, తామాడ ప్రదీప్, మామిడి గణపతి, మామిడి కృష్ణారావు ఇలా పలువురు కళాకారులు చేసిన కృషి ఫలించింది. నార్త్ అమెరికాలోని బొలీవియా పట్టణంలో గల బుక్ ఆఫ్ డిస్కవరీ కల్చరల్ అంబాసిడర్‌గా ప్రసన్నకుమార్ సౌజన్యంతో మల్లేన దేవరాజు అధ్యక్షతన ఆన్ లైన్‌లో జానపదాలను బృందగానం చేశారు. వజ్రపు కొత్తూరు మండలం దోకులపాడులో ఆన్లైన్ జానపద బృందగానం చేశారు. ఉద్దాన ప్రాంతానికి చెందిన ప్రముఖ జానపద గాయకులు కుత్తం వినోద్, బత్తిన శాంతారావు, పుక్కల్ల రాజేంద్ర, నక్క వాసు, స్వీయ రచన, గానంతో పలు జానపద గీతాలు కడు రమ్యంగా ఆలపించారు. నార్త్ అమెరికా డిస్కవరీలో స్థానం లభించినందుకు పలువురు వక్తలు ఉద్దానం గాయకులను అభినందిస్తూ, అవకాశం కల్పించిన మల్లేన దేవరాజుకి ధన్యవాదాలు తెలిపారు. సిక్కోలు








జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు, మాజీ అధ్యక్షుడు రాపాక ధనరాజు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్, ఉపాధ్యక్షుడు తామాడ ప్రదీప్, మామిడి గణపతి పలువురు పాల్గొన్నారు. కీబోర్డుపై టెక్కలి అశోక్, పాడ్ జీవన్‌పై జానపదాలకు మంచి సంగీతంతో వన్నె తీసుకువచ్చారు. ఉద్దానం జానపదాలకు అమెరికా స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారంటే కళాకారులు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయం. అమెరికాలోని బుక్ ఆఫ్ డిస్కవరిలో ఉద్దానం జానపదం నమోదు కావడంతో ఈ ప్రాంతీయులు కళాకారుల కృషిని అభినందిస్తున్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

* వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 (వార్త):** ప్రభుత్వ రంగంలోని మెడికల్ కాలేజీల నిర్మాణం విషయంలో అప్పటి సీఎం వైయస్ జగన్ గొప్ప సంకల్పంతో ముందుకెళ్తే, ప్రస్తుత సీఎం చంద్రబాబు మాత్రం ప్రైవేట్‌కు కట్టబెట్టే పీపీపీ ఒప్పందాలకు సిద్ధమవుతున్నారని వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటీకరణ వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటల్స్ రాకపోతే ప్రాంతీయ ప్రజలు ఎలా ఇబ్బందులు పడతారో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా చర్చ జరగాలని కోరారు. వైయస్ జగన్ హయాంలో ప్రభుత్వ రంగంలో లభించిన ప్రయోజనాలను, ఇప్పుడు చంద్రబాబు నిర్ణయాలతో ఏవిధంగా కోల్పోతున్నామో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఇప్పటికే ప్రజల్లో చర్చ మొదలైందని, దాన్ని మరింతగా విస్తరింపజేస్తామని వెల్లడించారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా చంద్రబాబు నిజ స్వరూపాన్ని ప్రజ లకు స్పష్టంగా చెబుతామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు, మీడియా సంస్థలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడం, ప్రభుత్వ పనితీరుపై గమనించి బయట పెట్టడం మీడియా ధర్మమ న్నారు. ఇటువంటి పత్రికలపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వాలు వచ్చి పోతాయి కానీ ప్రజాస్వామ్యం శాశ్వతమన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే స్వేచ్ఛా భావన, అభిప్రాయ స్వాతంత్ర్యం పరిరక్షించబడాలని సూచించారు. మీడియా స్వేచ్ఛను కుదించే ప్రయత్నాలు జరిగితే ప్రజల గొంతు మూయించ చినట్టే అవుతుందని తెలిపారు. ప్రభుత్వం నిజంగా పారదర్శకంగా నడుస్తోందని భావిస్తే, విమర్శలను సహజంగా స్వీకరించి సమాధానం చెప్పాలన్నారు. కక్ష సాధింపు, బెదిరింపు చర్యలు ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీస్తాయని, అందుకే, ప్రజాస్వామ్య విలువలు నిలబెట్టాలంటే పత్రికలపై కక్ష సాధింపు చర్యలు వెంటనే ఆపాలని ధర్మాన కృష్ణ దాస్ డిమాండ్ చేశారు.

## సమన్వయంతో ముందుకు సాగుదాం



**మెలియాపుట్టి సెప్టెంబర్ 14 (వార్త):** జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు ప్రతి ఒక్కరం సమన్వయంతో ముందుకు సాగుదామని ఆ సంఘ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సనపల తిరుపతిరావు అన్నారు. మెలియాపుట్టి మండల కేంద్రంలో క్షేత్ర సహాయకులు ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు భవిష్యత్తులో నిర్వహించనున్న వివిధ అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం క్షేత్ర సహాయకుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్షేత్ర సహాయకుల సంఘ నూతన అధ్యక్షులుగా సనపల తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా రాజు మజ్జి, కార్యదర్శిగా సిరిపురం జగదీశ్వరరావు, కోశాధికారిగా బొల్ల సింహాచలం, ఉపకోశాధికారిగా వనజాక్షిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటుగా మరో ఐదుగురిని ఈసి మెంబర్లును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు తిరుపతిరావు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేస్తూనే, సంఘం నిర్ణయం మేరకు కట్టుబడి పని చేస్తామని, ఎవరికి ఎక్కడ ఏ రకమైన ఆపదవచ్చినా కలిసికట్టుగా సహకరిస్తామని, విధినిర్వహణలో చేయాల్సిన సమయాలలో జిల్లా రాష్ట్ర యూనియన్‌ల పిలుపు మేరకు ప్రతీ ఒక్కరూ తరలి రావాలన్నారు. అలాగే క్షేత్ర సహాయకులు అరకొర వేతనాలతో ప్రతినిత్యం అనేక అవస్థలు పడుతూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, అర్హత కలిగిన వారికి పదోన్నతులు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఇంక్రిమెంట్లు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని వారంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. రాష్ట్ర, జిల్లా యూనియన్ల పిలుపు మేరకు తూచ తప్పకుండా కార్యక్రమలలో పాల్గొంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# హిందీ దినోత్సవం భారత దేశ సాంస్కృతిక ఐక్యతకు ప్రతీక



**పలాస, సెప్టెంబర్ 14 (వార్త):** హిందీ దినోత్సవం భారత దేశ సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాసలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో హిందీ భాష దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీని రాజ్యాధికార, విద్యలో, ప్రజల్లోకి తీసుకెళ్లడం, దేశవ్యాప్తంగా అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశం అన్నారు. హిందీ భాష దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాష అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ, అనేక ఉత్తర భారతీయ రాష్ట్రాల అధికారిక భాషగా హిందీ వాడబడుతోందని వెల్లడించారు. హిందీ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న నిర్వహిస్తారన్నారు. జాతీయ భాష అంటే దేశపు సంస్కృతి, ఐక్యత, గుర్తింపును సూచించే భాష అని తెలిపారు. అయితే భారత రాజ్యాంగంలో అటువంటి భాషగా ఎలాంటి నియామకం లేదని చెప్పారు. హిందీ భాష ప్రాముఖ్యతను హిందీ భాషా అవసరాన్ని విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలని తెలియజేశారు. దేశ సమైక్యతకు సమగ్రతకు ఆనాటి పెద్దలు గాంధీ స్వతంత్ర పోరాటానికి హిందీ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక హిందీ టీచర్స్, ఎంఈఓ, డిస్ట్రిక్ట్ హిందీ ఫోరం అధ్యక్షులు సంతోష్ పాల్గొన్నారు.



## బొడ్డపాడులో క్రీడా మైదానం సిద్ధం

**పలాస, సెప్టెంబర్ 14 (వార్త):** ఎస్‌జిఎఫ్ పలాస డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలకు బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం సిద్ధమైంది. సోమవారం నుంచి కబడ్డీ, చెస్ అండర్14,17 ఎంపికలు జరుగుతాయని పీడీ పద్మలోచన ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పాఠశాలల పీడీలు ఎస్.రామారావు, కుసుమహరనాథ్, తెలుకుల గణేష్, జడ్డే నారాయణ, సైని మధు, బొడ్డపాడు గ్రామ పెద్దలు కిక్కర ఢిల్లీరావు, స్కూల్ చైర్మన్ గర్తం తులసిరావు, నౌగాపు గంగాధర్, తామాడ ధర్మారావు, ఎక్స్ ఆర్మీ పోతనపల్లి జగదీష్ సహకారం అందిస్తున్నారు.

## కృష్ణవేణమ్మ మృతికి సంతాపం



**పలాస, సెప్టెంబర్ 14 (వార్త):** పలాస మండలం కోసింగిపురంనకు చెందిన కింతల కృష్ణవేణమ్మ మృతి తీరని లోటని యూటీఎఫ్, సిటూ నాయకులు వెంకటాచలం, ఎన్.మోహనరావు అన్నారు. ఆదివారం కోసంగిపురం గ్రామంలో కృష్ణవేణిమ్మ ఫొటోకి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. సానుభూతి తెలిపిన వారిలో రైతు సంఘం నాయకులు తమ్మినాన భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యన్. చంద్రయ్య, తమ్మినాన నారాయణరావు, బాడ పార్వతీశం, యన్ బైరాగి, పి.గజేంద్ర పాల్గొన్నారు.

## జాతీయ మహిళా సాధికారత సమావేశంలో ఎమ్మెల్యే శిరీష

**పలాస, సెప్టెంబర్ 14 (వార్త):** తిరుపతి పట్టణంలోని రాహుల్ కన్వెన్షన్ లోక్ సభ, శాసనసభల మహిళా ప్రజాప్రతినిధుల మొదటి జాతీయ మహిళా సాధికారత సమావేశంలో పలాస నియోజకవర్గ శాసన సభ్యులు గౌతు శిరీష ఆదివారం పాల్గొన్నారు. ఈ రెండు రోజుల సమావేశాన్ని లోక్ సభ సెక్రటేరియట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సమావేశాన్ని ప్రారంభించారు. వికసిత్ భారత్ మహిళల నాయకత్వం అనే నినాదంతో ఈ సదస్సు జరుగుతోంది. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల మహిళా ప్రజాప్రతినిధులు, పార్లమెంటరీ కమిటీల సభ్యులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళల సాధికారత, లింగ సమానత్వం, మహిళా ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి పాత్రపై చర్చలు జరుగుతున్నాయి.



## పొలంలోకి దూసుకెళ్లిన కారు

**పోలాకి/జలుమూరు, సెప్టెంబర్ 14 (వార్త):** పోలాకి మండలం బార్జీ పాడు దగ్గరలో గల పొలంలోకి కారు దూసుకెళ్లిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటు వంటి ప్రమాదం జరగలేదని స్థాని కులు తెలిపారు. బార్జీపాడు నుంచి నరసన్నపేట వెళ్తున్న సమయంలో అదుపుతప్పి పొలంలోకి దూసుకువెళ్లింది.




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఘనంగా హిందీ దినోత్సవం



**జలుమూరు, సెప్టెంబర్ 14(వార్త):** టెక్కలిపాడు ఎంపీయూపీ పాఠశాలలో జాతీయ హిందీ భాష దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో చేపట్టిన కార్యక్రమంలో కరవంజ, టెక్కలి పాడు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు బి.ఈశ్వర్ రావు, బి.వి.ఎస్ ప్రసాద్‌ను సత్కరించారు. ఈ క్రమంలో హిందీ భాష యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, రైమ్స్ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కుమార్, లక్ష్మణరావు, చిన్ని కృష్ణ, శ్రీదేవి, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి వేడుకలు

**కోటబొమ్మాళి, సెప్టెంబర్14 (వార్త):** కోటబొమ్మాళి శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం సందర్భంగా ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 142వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా గాడిచర్ల చిత్రపటానికి గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 1883 సెప్టెంబర్ 14న జన్మించిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్వాతంత్ర్య సమరయోధుడిగా మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో గ్రంథాలయ ఉద్యమానికి అహర్నిశలు కృషి చేశారన్నారు. ప్రతి విద్యార్థి ఆయన గురించి తెలుసుకోవాలన్నారు. ఆ తరువాత గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు జి.సూరమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో బీసీలకే పెద్దపీట



**కోటబొమ్మాళి, సెప్టెంబర్14 (వార్త):** కూటమి ప్రభుత్వంలో బీసీలకే పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లి రవేంద్ర, దువ్వారపు రామారావు అన్నారు. ఆదివారం విజయవాడలో బీసీ సాధికారిక కన్వీనర్లు, జిల్లా అద్యక్షుడు, జూనల్ కన్వీనర్లను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత జనబాలం కలిగిన బీసీలకు ప్రభుత్వ పథకాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. గత ప్రభుత్వలో బీసీలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీసీలపై ఉందని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ కళింగ వైశ్య సాధికారిక రాష్ట్ర కన్వీనర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు సీదిరి పరామర్శ



**పలాస, సెప్టెంబర్ 14 (వార్త):** పలాస మండలం అల్లుకోల గ్రామానికి చెందిన దువ్వాడ కాంతారావు తండ్రి దువ్వాడ జానకీరామయ్య ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం అల్లుకోల గ్రామంలో వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలాస మండల ఎంపీపీ ప్రతినిధి ఉంగా సాయికృష్ణ, వైస్సార్సీపీ పలాస మండల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్సార్సీపీ పలాస–కాశీబుగ్గ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ మాధవరావు, తర్లకోట సర్పంచ్ కొర్ల సంతోష్ కుమార్, మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, వైస్సార్సీపీ పలాస మండల పార్టీ కార్యదర్శి ఖగేశ్వరదొర, అల్లుకోల బూత్ కన్వీనర్ దువ్వాడ లోజేశ్వరరావు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## బొడ్డపాడుతో చెత్త తొలగింపు

**పలాస, సెప్టెంబర్14 (వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని టిడిపి నాయకులు కిక్కిర ఢిల్లీ రావు అన్నారు. బొడ్డపాడు గ్రామ పరిధిలో గల గొల్లవీధిలో చాలా రోజులు నుండి పేరుకుపోయిన చెత్త కుప్పను దగ్గరుండి ఢిల్లీరావు తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు.

# రణభేరి జాతను విజయవంతం చేయాలి

### * యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి

**పలాస, సెప్టెంబర్ 14 (వార్త):** పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై సోమవారం పలాసలో నిర్వహిస్తున్న రణభేరి జాతను విజయవంతం చేయాలని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి కోరారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఆదివారం కాశీబుగ్గలో జిల్లా కార్యదర్శి కె.రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. ప్రధానంగా ఆర్థిక విద్యారంగ సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలంగా మారుతున్నాయని తెలిపారు. బదిలీలు ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్న ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొన సాగుతున్నారని, మూడు నెలలుగా ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జీతాలు లేవన్నారు. ప్రభుత్వం మారిన ప్రపంచ బ్యాంకు సాల్ట్ పథకం రాష్ట్రములో అమలు చేయడం ద్వారా ప్రభుత్వ విద్య వ్యవస్థ మరింత బలహీన పడుతుందని తెలిపారు. మూడో వంతు ప్రైమరీ పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూల్స్‌గా మారిపోయాయన్నారు. సగం పైన హై స్కూల్స్ సింగిల్ సబ్జెక్టు టీచర్లుగా తయారైనాయని, హైస్కూల్లో పనిచేయాల్సిన స్కూల్ అసిస్టెంట్స్ సర్ప్లస్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూనే ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు పరిమితం చేయడం విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పాలనే విధంగా కాకుండా ఆన్లైన్ అప్లోడింగ్ కార్యక్రమాలు విద్యాసక్తి స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను బలవంతం చేయడం ఉపాధ్యాయులపై యాప్‌ల పని భారం, పి4, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్ష మూల్యాంకనం, ఆన్లైన్ అప్లోడ్, గ్రీన్ పాస్పోర్ట్ మొదలైన బోధనేతర పనులు పనిభారం విపరీతంగా ఉపాధ్యాయులపై మోపుతున్నారని మండిపడ్డారు. తద్వారా విద్యాబోధనకు ఆటంకంగా ఉందని తెలియజేశారు. పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, డిఎలు విడుదల చేయాలని, ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 57 మెమో ప్రాప్తికి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రారంభమయ్యే యూటీఎఫ్ రణభేరి బైక్ జాత కాశీబుగ్గ పాత బస్టాండ్ దరి సంత మైదానం, చిన్నబడాం మీదుగా శ్రీకాకుళం చేరుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాలలో ప్రారంభమవుతున్న రణభేరి జాత ఈనెల 19 వరకూ సాగుతుందని, 25న రాష్ట్రంలో బహిరంగ సభ ద్వారా యుటిఎఫ్ రణభేరి కార్యక్రమం ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమాలన్నింటిలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుంటూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుంట కోదండరావు, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్ వెంకటాచలం, పలాస మండల అధ్యక్ష ,కార్యదర్శులు తమ్మినాన జయరాం, ఎస్వీ రమణ, కరజాడ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు టీ వీ రమణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# అఖిల గాండ్ల తెలికులను ఆదుకోవాలి

### * సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 (నేడు న్యూస్):** శ్రీకాకుళం నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో ఆదివారం అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 26 జిల్లా శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గం, జిల్లా శాఖల యువజన కన్వీనర్లు, జిల్లా శాఖల మహిళా కన్వీనర్లు పాల్గొన్నారు. సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు మంజూరు చేసిందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనుకబడిన కులమైన అఖిల గాండ్ల తెలికులకు కార్పొరేషన్ మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర శాఖ కార్యనిర్వాహక అధ్యక్షులు నరవ అనంతరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ మాట్లాడుతూ గాండ్ల తెలికుల దేవతిలకుల నిరుద్యోగ యువకులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని, ఉచిత విద్యుత్‌ను అందజేయాలని కోరారు. అప్పుడే కరెంటు గానుగలు ఏర్పాటు చేసుకుని కులవృత్తిని కాపాడుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ గౌనివాని శ్రీనివాసరావుతో పాటు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే.ఎల్.ప్రసాద్, తిరుపతి హరగోపాల్, అంబటి గురుమూర్తి, డా.కల్లేపల్లి కూర్మనాథ్, గౌరవ సలహాదారులు ఇంజిరాపు విశ్వనాథం, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, కార్యవర్గం పాల్గొన్నారు.

## హాస్టళ్లలో బాలికల కోసం ఉచిత వైద్య శిబిరాలు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 (నేడు న్యూస్):** జిల్లాలో కిశోర బాలికల ఆరోగ్య రక్షణ కోసం ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, రణస్థలంలో గల ఎస్‌డబ్ల్యూ హాస్టళ్లు, బీసీ గర్ల్స్ హాస్టళ్లలో ప్రసూతి, గైనకాలజీ వైద్యుల సంఘం శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా బాలికలకు అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు, ఆరోగ్యంపై అవగాహన, సానిటరీ నాప్కిన్ల పంపిణీ, సమగ్ర ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. గైనకాలజిస్టులు పాల్గొని కిశోర బాలికలకు ఆరోగ్యంపై సూచనలు అందించారు.




## నేడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబర్14 (వార్త):** నరసన్నపేట పద్మావతి డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం పది గంటలకు యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు రూపొందించిన ర్యాంపు పథకం ద్వారా చేపడతామన్నారు. ట్రెడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పరిశ్రమల వ్యవస్థాపకత వృత్తి నైపుణ్యంపై నెల రోజులు పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు అర్హులన్నారు. తెల్ల రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలను జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయానికి అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమన్వయకర్త అరుణ్ కుమార్ (9885117831)కు సంప్రదించాలని సూచించారు.

## అరసవల్లికి పోటెత్తిన భక్తులు

**అరసవల్లి, సెప్టెంబర్ 14 (నేడు న్యూస్):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.3,18,800, పూజలు, విరాళాల రూపంలో రూ.80,188, ప్రసాదాల రూపంలో రూ.2,25,645 ఆదాయం వచ్చిందని ఈవో ప్రసాద్ తెలిపారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 (నేడు న్యూస్):** ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ లో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, అర్జీల స్థితికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శిథిలావస్థలో పశువైద్య ఆరోగ్య కేంద్రం

**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబర్ 14(వార్త):** నరసన్నపేట మండలం కంబకాయ సచివాలయ పరిధిలో ఉన్న పశువైద్య ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. పదేళ్లుగా పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని సిబ్బంది తెలిపారు. కేంద్రానికి ఎదురుగా ఉన్న రహదారి ఎత్తుగా ఉండడంతో ఇటీవల పడిన వర్షాలకు కేంద్రంలోకి నీరు చేరిపోయింది. విధులు నిర్వహించేందుకు బురద నీటిలో వెళ్లక తప్పడం లేదు. మరమ్మతులు చేపట్టి రాకపోకలు సక్రమంగా జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.



### రవితేజ డెవలపర్ అధినేత, బీజేపీ నేత..

# సింహాచలానికి బిజినెస్ అవార్డు

*** హైటెక్ సిటీలో అవార్డు అందుకున్న పోకతోట * అభినందనలు తెలిపిన రియల్టర్లు, బిల్డర్లు, నేతలు**

**శ్రీకాకుళం, సెప్టెంబర్11 (వార్త):** బీజేపీ నేత, రవితేజ డెవలపర్స్ అధినేత పోకతోట సింహాచలం తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎలైట్ బిజినెస్ అవార్డు 2025కి నామినేటెడ్ అయ్యారు. ఆదివారం హైటెక్ సిటీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును కెనడాకు చెందిన మంత్రి లీలాషరాన్ అహీర్, అర్జున అవార్డు గ్రహీత అనుప్ కుమార్ చేతుల మీదుగా పోకతోట సింహాచలం అందుకున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో తనకంటూ ఒక ముద్ర వేస్తూ రియల్ ఎస్టేట్ రంగాన్ని మచ్చలేని వ్యాపారిగా, ఆంధ్ర, తెలంగాణలో వ్యాపార దిగ్గజంగా సింహాచలం ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఎంతోమంది నిరుద్యోగులను ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, లాభం కంటే కస్టమర్ల శ్రేయస్సు కోసమే రవితేజ డెవలపర్స్‌ను ఏర్పాటు చేశారు. వ్యాపారంలో కస్టమర్స్‌కి సైట్ అమ్మడమే కాకుండా పర్యావరణాన్ని ఆహ్లాదకరంగా ఉంచుటకు మొక్కలు నాటి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని వారికే ఇస్తున్నారు. ఈ అవార్డును అందుకు పోకతోట సింహాచలంనకు పలువురు రియల్టర్లు, బిల్డర్లు, స్నేహితులు, కస్టమర్లు అభినందనలు తెలిపారు. సరైన వ్యక్తికే ఈ అవార్డు వచ్చిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీఈవో విష్ణుమూర్తి, డైరెక్టర్స్ ముద్దాడ సింహాచలం, జై చంద్ర, సాఫ్ట్వేర్ ఇంజనీర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.



# ఎరువుల కోసం రైతుల అవస్థలు

*** యూరియా కోసం బారులు తీరిన రైతులు * ఎరువులు ఎవరికి అందుతున్నాయో తెలియని పరిస్థితి**
*** సమాచారం అందజేయని వ్యవసాయశాఖాధికారులు * దిక్కుతోచని స్థితిలో సన్న చిన్న కారుల రైతులు**



**ఎల్.ఎన్.పేట, సెప్టెంబర్14(వార్త):** ఎల్ఎన్‌పేట మండల పరిధిలో ఉన్న రైతులు ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిస్థితులపై ఎక్కడ కూడా పొంతన కుదరడం లేదు. అధికారులు, కూటమి నేతలు కావాల్సినంత ఎరువులు అందుబాటులోఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని చెబుతున్నా.. ఎల్ఎన్‌పేట మండలంలో పెద్దగా ఎరువులు రైతులకు అందుబాటులో ఉండడం లేదు. మండలానికి యూరియా రైతు సేవా కేంద్రాలకు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పంపిణీ చేస్తున్నారో తెలియక రైతులు గందరగోళానికి గురవుతున్నారు. ఎల్ఎన్‌పేట, తురకపేట జంక్షన్లలో ఉన్న ప్రైవేటు ఎరువుల దుఖాణాల వద్ద అధికారులు ఎరువులు అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ఎరువులకు ఆయా సచివాలయాల వద్ద వ్యవసాయ శాఖ అధికారులు టోకెన్లు పంఫిణీ చేస్తే తప్పా ఎరువు అందడం లేదు. టోకెన్లు ఎవరికి ఇస్తున్నారో తెలియడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయాధికారులు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. సోమవారం మండలంలోని ఎల్ఎన్‌పేట, తురకపేట జంక్షన్లలో ప్రైవేటు దుఖాణాల వద్ద యూరియా కోసం రైతులు గంటల తరబడి పడిగాపులు కాశారు. చివరకు కొందరికి ఎరువులు దొరక్కపోవడంతో ఉసూరమంటూ వెనుదిరిగారు. వ్యవసాయాధికారులు తమకు నచ్చిన వారికే ఎరువులు పంపిణీ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

## డ్రోన్ సహాయంతో జిల్లేడు ద్రావణం పిచికారి

**పోలాకి/జలుమూరు, సెప్టెంబర్ 14(వార్త):** డ్రోన్ సహాయంతో జిల్లేడు ద్రావణం పిచికారి చేశామని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ తెలిపారు. ఆదివారం పోలాకి మండలం మబగాం గ్రామంలో ధర్మాన లక్ష్మణ దాసు అనే రైతుకు సంబంధించి పది ఎకరాల్లో చేపట్టిన వరి సాగులో జిల్లేడు ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ ద్రావణం వలన నత్రజని, భాస్వరం, పొటాషియం నేరుగా అందుతుందని వివరించారు. కార్యక్రమంలో రైతు లక్ష్మణ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం



**నరసన్నపేట/జలుమూరు, సెప్టెంబర్ 14(వార్త):** నరసన్నపేట బీసీ బాలికల వసతి గృహంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం అబ్స టేట్రిక్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆదివారం గైనిక్ సమస్యలపై ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రముఖ గైనకాలజిస్టులు వి.రామారావు, ఆర్.సంధ్య, సీహెచ్ కృషి సాయి శ్వేత, నందిని, మాన్యశ్రీ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీ4 కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



**పోలాకి/జలుమూరు, సెప్టెంబర్ 14(వార్త):** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సత్సంగసభ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం పేర్కొన్నారు. ఆదివారం పోలాకి మండలం చింతాడపేటలో ఉన్న శ్రీ రామయోగిబాబా ఆశ్రమంలో ఆధ్యాత్మిక సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ నాథం మాట్లాడుతూ మానవుడు అనునిత్యం భగవద్గీత, భాగవతం, రామాయణం వంటి గ్రంథాలు చదవాలన్నారు. అలాగే పార్వతీపురం ఆశ్రమానికి చెందిన మోహనరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, అనంతరావు పాల్గొన్నారు.

## భగవద్గీత పుస్తకాలు పంపిణీ

**సారవకోట/జలుమూరు, సెప్టెంబర్ 14 (వార్త):** సారవకోట మండలంలోని అవలింగి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతం కమిటీ సభ్యులు భగవద్గీత పుస్తకాలు పంపిణీని చేశారు. శ్రీ కృష్ణ భగవానుడు బోధించిన భగవద్గీత ప్రతీ ఒక్కరికి చేరవేయాలనే ఉద్దేశంతో గ్రామాల్లో పర్యటిస్తూ ఈ భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. భారతీయులు ప్రతీ ఒక్కరూ ఈ భగవద్గీతను చదవాలని సూచించారు.





## గోపాలకృష్ణకు మాజీ మంత్రి శివాజీ పరామర్శ

**మందస, సెప్టెంబరు 14(వార్త):** రిటైర్డు ఉపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ మాజీ నాయకుడు సీర గోపాలకృష్ణకు మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ పరామర్శించారు. జిల్లుండ పంచాయతీ డిమిరియా గ్రామానికి చెందిన సీర గోపాలకృష్ణ ప్రస్తుతం మందసలో ఉంటున్నారు. సర్దార్ గౌతు లచ్చన్న శిష్యునిగా, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ ముఖ్య అనుచరునిగా ఆయన ఉన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పార్టీలో మంచి సేవలు అందించారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన గోపాలకృష్ణకు శివాజీ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని ఆయన భార్య సావిత్రి, కుమార్తెలు ధనలక్ష్మి, సుధలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బాలిగాం పీఏసీఎస్ ఛైర్మన్ లబ్బ రుద్రయ్య, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, మందస అధ్యక్షుడు గార కృష్ణారావు, పార్టీ నాయకులు రాజాన మహేశ్, గువ్వాడ లక్ష్మీనారాయణ, సీర ఈశ్వరరావు, ముంజేటి చంద్రశేఖర్, ముడిమించి నవీన్ కుమార్, దేవరశెట్టి మార్కండేయులు, ప్రకాష్ పాణిగ్రాహి, కొర్నాన నాగేశ్వరరావు, దేబాసిస్ పండా, చిరంజీవి ఉన్నారు.

## మొక్కలు నాటిన మందస గో గ్రీన్



**మందస, సెప్టెంబరు 14(వార్త):** మందస పట్టణం సుందరీకరణకు నాయకులు, యువకులు, స్వచ్ఛందసంస్థలు కృషి చేస్తూనే ఉన్నారు. మందస పంచాయతీలో సెంటర్ లైటింగ్ నిర్మాణం జరగడంతో మొక్కలు నాటి, పచ్చదనంతో మందసకు కొత్తరూపు తీసుకురావడానికి వారంతా ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. దీనిలో భాగంగా మందస గో గ్రీన్ సంస్థ తరుపున మందస పట్టణంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిన్ని తిరుపతిరెడ్డి, శానాపతి కిషోర్ కుమార్, వడ్డి చంద్రశేఖరం, ఇప్పిలి కేశవరావు(చిట్టి), శ్రీనివాస్ పాడి, మామిడి కోదండరావు, సంతోష్ కుమార్ పండా, కుప్పాయి గోపాలరావు, జల్లు కాళీచరణ్, శిస్టు సోమనాథ్, తెలుకల గణేశ్ సాహు, గొర్లె కుశరాజు తదితరులు పాల్గొనారు.

## పాడి పశువులలో గాలికుంటువ్యాధి నివారణా టీకాలు తప్పనిసరి



**మందస, సెప్టెంబరు 14 (వార్త):** పాడి పశువులలో గాలికుంటువ్యాధి అత్యంత ప్రమాదకరమని, పాడి రైతులు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి కోరారు. మందసలో వారు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ద్వారా ఈ నెల 15నుంచి అక్టోబర్ 15వరకు చేపడుతున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమంలో తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి వైరస్ వల్ల సోకుతుందని, ఇది అంటువ్యాధని, ఒక పశువు నుండి మరో పశువుకు కలుషిత నీరు, మేత వలన సోకుతుందన్నారు. వ్యాధి బారిన పడిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఉంటాయని. నోటిలో, కాళ్ళ గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయన్నారు. నోటి నుండి తీగలు మాదిరిగా చొంగ కారుతూ తిండి మాని నీరసిస్తాయన్నారు. వ్యాధి బారిన పడిన పశువులలో పాల దిగుబడి తగ్గడం, చూడి పశువులు ఈసుకుపోవడం, పనిసామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు వస్తాయన్నారు. వ్యాధి సోకిన తరువాత వైద్యం ఆలస్యం చేస్తే పశువులు చనిపోయి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, ఈ వ్యాధి నివారణకు 11200 డోసుల వాక్సిన్ మండలంలో అందుబాటులో ఉందన్నారు. మండలంలో గల అన్ని గ్రామాలలోఈ వ్యాధి రాకుండా వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేయనున్నామని, పాడిరైతులు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది ద్వారా వేస్తున్న ఈ టీకాలను వినియోగించుకోవాలని సూచించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546